28న ఐటీఐలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ - 8వ పేజీ
ప్రేమలో విఫలమై యువకుడి ఆత్మహత్య - 7వ పేజీ
విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఎస్పీ - 8వ పేజీ

'ఘనుల్లో' గుబులు



- ప్రభుత్వం మారడంతో జిల్లా గనులశాఖ అధికారుల్లో గుబులు
- అయిదేళ్ల వైసీపీ పాలనలో గ్రావెల్, మట్టి, లేటరైట్ యథేచ్ఛగా దోపిడీ
- అయినా ఏనాడు వైసీపీ నేతల అక్రమాలపై కన్నెత్తిచూడని జిల్లా గనులశాఖ
- పైగా ఎక్కడికక్కడ అక్రమ తవ్వకాలకు కాసులు పుచ్చుకుని సహకారం
- జిల్లావ్యాప్తంగా రూ.200కోట్ల విలువైన పోలవరం మట్టి మాయం
- రామేశంమెట్టలో అయిదేళ్లు నిరాటంకంగా రూ.450కోట్ల గ్రావెల్ దోపిడీ
- ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడిల్లో వందల కొండల్లో అక్రమ మైనింగ్
- కోట్లలో గనులశాఖ రాయల్టీకి గండి: అయినా నోరుమెదపని అధికారులు
- పర్మిట్లు లేకపోయినా తనిఖీలు, దాడులు చేయడానికి సాహసించని వైనం
- అప్పటి షాడో సీఎం ద్వారంపూడి ఏం చెబితే అదే అధికారులకు వేదవాక్కు
- కొత్తసర్కారు రాకతో గత అక్రమాలపై విచారణకు ఆదేశిస్తుందేమోనని గుబులు

రామేశంమెట్టలో అక్రమ తవ్వకాలతో కరిగిపోయిన కొండలు



జిల్లా గనులశాఖ కార్యాలయం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా అయిదేళ్లు.. కళ్లప్పగించి కూర్చున్నారు.. కళ్లముందే వందలకోట్ల మట్టి, గ్రావెల్, లేటరైట్, క్వారీ రాయి తరలిపోతున్నా ఖాతరు చేయకుండా వదిలేశారు.. జరుగుతోంది నిలువెత్తు అక్రమం అని తెలిసినా కనీసం దాడులు, తనిఖీలు చేయడానికి కూడా చేతులు రాలేదు.. ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రాయల్టీ రావాల్సి ఉన్నా పోతేపోనీ మాకేంటి అని కళ్లు మూసేసుకున్నారు. అధికారపార్టీ నేతలు ఎంత బరితెగించినా మారు మాట్లాడలేదు. నేతలకు సహకరించడం ద్వారా తమ రెండు జేబులూ నిండితే చాలనుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఆ శాఖ అధికారులు వణికిపోతున్నారు. అయిదేళ్ల వైసీపీ నేతల అరాచకాలకు అడ్డగోలుగా కొమ్ముకాసిన ఫలితం తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందేమోనని బెంబేలెత్తుతున్నారు. పోలవరం మట్టి మొదలు రామేశంమెట్ట అక్రమ తవ్వకాలు, లేటరైట్ దోపిడి వరకు తవ్వితే తామె ఎక్కడ ఇరుక్కుపోతామోనని జిల్లానుంచి బదిలీకి ప్రయత్నిస్తున్నారు. ఇంతకు ఆ శాఖే జిల్లా గనులశాఖ.

రూల్స్ గీల్స్ జై..

అపార సహజవనరులకు జిల్లా పెట్టింది పేరు. ఒకపక్క మెట్టలో కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్, మరోపక్క ఆ చివర గండేపల్లినుంచి ఈ చివర తుని వరకు వందల కోట్ల విలువైన పోలవరం మట్టి పోగులు, అటు ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి, కోటనందూరులో వందలాది నల్లరాతి కొండలు, విలువైన లేటరైట్. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి వీటిపై కన్నేసింది. ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఈ అయిదేళ్లలో వీటిని ఎక్కడ కనిపిస్తే అక్కడ జుర్రేశారు. గనులశాఖతో సంబంధం లేకుండా, అనుమతుల గురించి పట్టించుకోకుండా ఎడాపెడా వీటిని తవ్వి తరలించుకుపోయారు. ప్రధానంగా మాజీ సీఎం జగన్‌కు సన్నిహితుడైన కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి జిల్లాలో సహజవనరులను పూర్తిగా మింగేశాడు. ఎక్కడ మట్టి, గ్రావెల్, లేటరైట్ ఉన్నా వాలిపోయి కొండలకు కొండలను చెరబట్టేశాడు. ప్రధానంగా పెద్దాపురం, గండేపల్లి మండలాల్లో రామేశంమెట్టలో 823 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొండలు, గుట్టలను నాలుగేళ్లపాటు నిరాటంకంగా ఊడ్చేశాడు. పేదల ఇళ్ల స్థలాలకు మట్టి తరలింపు పర్మిట్ ముసుగులో పిసరంత అనుమతి చూపించి కొండలకు కొండలను లేపేశాడు. కొండలను మాయం చేసేసి వాటిస్థానంలో లోయలను సృష్టించారు. ఇలా 800 ఎకరాలకుపైగా కొండలు, గుట్టల్లో ఉన్న కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రియల్ ఎస్టేట్ అవసరాలకు నిత్యం వందలాటి టిప్పర్లలో తవ్వి తరలించుకుపోయారు. ఎవరూ ఈ లారీలు ఆపకుండా ఉండా ఏకంగా పోలీసులు, గనులశాఖ, రవాణాశాఖ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నాయి. ఇలా మొన్న ఎన్నికల వరకు రామేశం మెట్టనుంచి రూ.450కోట్లకుపైగా మట్టి, గ్రావెల్ మాయమైపోయింది. ఇన్నేళ్లలో ఏనాడు జిల్లా గనులశాఖ అటువైపు కన్నెత్తికూడా చూడలేదు. తవ్వుతున్నది అప్పటి సీఎం మనిషి కావడంతో అన్నీ తెలిసినా మెట్ట జోలికివెళ్లలేదు.

ఖజానాకు కోట్లలో తూట్లు

వాస్తవానికి సొంత అవసరాలకు ఎవరైనా తమ పొలం, లేదా స్థలంలో మట్టి తవ్వాలంటే గనులశాఖ అనుమతి పొందాలి. రాయల్టీ చెల్లించాలి. కానీ ఇన్ని వందల కోట్ల విలువైన గ్రావెల్ తరలిపోవడం ద్వారా ఖజానాకు కోట్లలో తూట్లు పడ్డా ఏనాడు గనులశాఖ నోరుమెదపలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఆ శాఖ మొద్దునిద్రపోయింది. పోలవరం ఎడమ ప్రధాన కాలువ గండేపల్లి, ప్రత్తిపాడు, జగ్గంపేట, గొల్లప్రోలు, శంఖవరం, తొండంగి, తుని మండలాల మీదుగా పయనిస్తోంది. ఈ కాలువను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 18మీటర్ల లోతుకు తవ్వారు. దీంతో కాకినాడ జిల్లాలో 2.50కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చింది. దీన్నంతటినీ కాలువకు ఆనుకుని ఉన్న భూముల్లో 15 అడుగుల ఎత్తు వరకు మేటల రూపంలో అప్పట్లో పోగేశారు. మరికొంత మట్టిని కాలువకు దూరంగా నిల్వ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతల కళ్లు ఈ మేటలపై పడ్డాయి. రియల్ ఎస్టేట్ అవసరాలకు ఈ మట్టిని వైసీపీ నేతలు ఇళ్ల స్థలాల చదును ముసుగులో తరలించుకుపోయి అమ్మేసుకుని కోట్లు గడించారు. గనులు, జలవనరులశాఖ అనుమతులతో సంబంధం లేకుండా మొత్తం మాయం చేసేశారు. దీని విలువ రూ.200కోట్ల పైమాటే. కానీ ఏనాడు గనులశాఖ అధికారులు పట్టించుకోలేదు. తమకేం సంబంధం లేనట్లే వ్యవహరించారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి, కోటనందూరు మండలాల్లో వందలాది క్వారీ కొండలున్నాయి. వీటికి అనుమతులు వస్తే మైనింగ్ చేయాలి. కానీ వైసీపీ నేతలు వీటిని పూర్తిగా గుల్ల చేసేశారు. అక్రమంగా తవ్వి కొండలనే మాయం చేసేశారు. కానీ అయిదేళ్లలో ఏనాడు ఎక్కడ తనిఖీలు చేయలేదు. బాధ్యులను గుర్తించి జరిమానాలు పెద్దగా విధించిందీ లేదు. అదే సమయంలో అక్రమార్కులకు సహకారం అందించీ తాము జేబులు నింపేసుకున్నారు. రౌతులపూడిలో లేటరైట్, ఇతర ఖనిజాలను లైసెన్స్‌లు లేకుండా వైసీపీ నేతలు తరలించుకుపోయారు. అయినా ఏ ఒక్క రోజు గనులశాఖ ఉద్యోగం చేయలేదు. ఒకరకంగా చెప్పాలంటే వైసీపీ అయిదేళ్ల పాలనలో జిల్లాల ఖనిజ దోపిడీ వెయ్యికోట్ల పైమాటే.

పాపాలు చుట్టుముడతాయని వణుకు..

అయిదేళ్లపాటు కళ్లమూసుకుని కూర్చున్న జిల్లా గనుల శాఖ అధికారులు ఇప్పుడు ప్రభుత్వం మారడంతో వణికిపోతున్నారు. అనుమతులు లేకుండా మొత్తం మట్టి, గ్రావెల్ తరలిపోవడంతో రాయల్టీకి పడిన గండి విషయంలో కొత్త ప్రభుత్వం తమపై చర్యలు తీసుకుంటుందన్న భయంతో విలవిల్లాడుతున్నారు. కొంతకాలం కిందటి వరకు వైసీపీ నేతలు చెప్పిన ప్రతి పనికి తలూపి అడ్డగోలు వనరుల దోపిడీ చేస్తున్నా చూస్తూ కూర్చున్న అధికారులు ఇప్పుడు ఊహించని విధంగా ప్రభుత్వం మారడంతో గత పాపాలను తమను మింగేస్తాయని ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం ఆకస్మికంగా సమీక్ష నిర్వహిస్తే ఎక్కడా దొరకకుండా ఉండేందుకు జిల్లా గనులశాఖ డీడీ, ఏడీ స్థాయి అధికారులు ఫైళ్లలో రకరకాల జిమ్మిక్కులు చేస్తున్నారు. మరికొందరైతే ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోతే తప్పించుకోవచ్చనే ఆలోచన చేస్తున్నారు. ప్రధానంగా ఈశాఖ ఉన్నతాధికారిని గత ప్రభుత్వంలో తన సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ద్వారంపూడి రప్పించుకున్నారు. సదరు అధికారి సాయంతో జిల్లాలో కొండలు, గుట్టలు, మెట్టలను ఊడ్చేశాడు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో సదరు కీలక అధికారికి ఏంపాలుపోవడం లేదు. తనపై ఏచర్యలు లేకుండా కాపాడాలంటే ప్రస్తుత అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకోవాలని ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

జిల్లాను అన్ని రంగాల్లో..
అగ్రగామిగా నిలుపుతాం

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్
- బాధ్యతల స్వీకరణ



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్



కలెక్టరేట్(కాకినాడ), జూన్ 24: అన్ని రంగాల్లో జిల్లాను పురోగామిగా నిలిపేందుకు అందరి సమష్టి భాగస్వామ్యంతో కృషిచేస్తానని నూతన కలెక్టర్ సగిలి షణ్మోహన్ తెలిపారు. సోమవారం ఉదయం నూతన కలెక్టర్‌గా కలెక్టరేట్‌లోని తమ ఛాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పుష్కలమైన వనరులతో ప్రగతిశీల జిల్లాగా కాకినాడ జిల్లాకు రాష్ట్రంలో మంచి గుర్తింపు ఉందన్నారు. జిల్లా విశిష్టతల గురించి తనకు ముందు పనిచేసిన కలెక్టర్ల ద్వారా తెలుసుకున్నానన్నారు. ఘనమైన చారిత్రక నేపథ్యం కలిగిన కాకినాడ జిల్లా స్వరూపం, స్థితిగతులపై సమగ్ర అవగాహన సత్వరం పెంపొందించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల లబ్ధి అర్హులైన వారందరికీ అందిస్తూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార హాల్‌లో వివిధ శాఖల అధికారులను కలిసి వారివారి శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జన రంజకమైన సమర్థపాలన, సేవలు సజావుగా ప్రజలకు అందించేందుకు అధికారులు సమన్వయంతో సమష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు విశేష స్పందన

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 24: కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో సమావేశమందిరంలో ప్రజా ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం జరిగింది. జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్, డీఆర్వో తిప్పేనాయక్, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీరామ్‌చంద్రమూర్తిలు కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై 250 అర్జీలను అందజేశారు. వీటిని పరిష్కారించాల్సిందిగా వివిధశాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారానికి అధికా రులు కృషి చేయాల న్నారు. ప్రజా ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టిపెట్టి సకాలంతో పరిష్కరించాలన్నారు. డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అర్జీల వెల్లువ

- తొలిరోజే వందల సంఖ్యలో..

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 24: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి తొలిరోజే సోమవారం పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. దీంతో కాకినాడ కలెక్టరేట్ ప్రాంగణం కిక్కిరిసింది.

పింఛన్ మంజూరు చేయలేదు
-నూకరాజు, కాకినాడ జగన్నాథపురం

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో పింఛన్ మంజూరు చేయలేదు. దీనివల్ల అనేక ఇబ్బందులు పడ్డాను. ఎన్నిసార్లు అధికారులు చుట్టూ తిరిగినా ఉపయోగం లేదు. టీడీపీ ప్రభుత్వం పింఛన్ ఇస్తుందని వచ్చాను.

చిట్ ఫండ్ కంపెనీ మోసం చేసింది
-డి.వరలక్ష్మి, కొవ్వాడ కాకినాడ రూరల్ మండలం

మాది కొవ్వాడ. ప్రతి రూపాయి కూడబెట్టి శ్రీవినాయక ఈస్ట్ చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.5లక్షల చీటి వేశాను. ఆ డబ్బులు ఇవ్వకుండా చిట్స్ ఎత్తివేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు దీనివల్ల తీవ్రంగా నష్టపోయాం. జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

కబ్జాదారులపై కలెక్టర్ ఫిర్యాదు

కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట పంచాయతీ గైగోలుపాడులో ఉన్న కృష్ణుడు ఆలయానికి తూరంగికి చెందిన కుందూరు సుబ్బారావు అనే దాత ఇచ్చిన 30 సెంట్లు భూమి వివాదంపై సోమవారం స్పందనలో నూతన కలెక్టర్‌కు ఆలయ కమిటీ ఫిర్యాదు చేసింది. ఈ ఆలయ భూమి ఆక్రమించి.. దానిలో రోడ్డు, డ్రైను, ప్రహరీ నిర్మాణాలు చేపడుతున్న రామవరాజు, తప్పుడు రికార్డులు సృష్టించడానికి సహకరించిన అధికారులు, తదితరులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ భూమి శిస్తు కడుతూ అనుభవిస్తున్నటు వంటి భూమిని తమది కాదని వేరే వ్యక్తులను రంగంలోకి దించి తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి దేవాలయ భూమిని కాజేయాలని చూస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో దీనిపై కలెక్టర్లకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. అప్పటి ప్రభుత్వ నేతలు ఈ కబ్జాదారులతో కుమ్మక్కై ఈ భూమి వివాదాన్ని సాగదీస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



ఉప్పాడ బీచ్‌లో విద్యుత్ ప్లాంటు దాటిన తర్వాత రోడ్డుకు ఏర్పడిన గొయ్యి

బీచ్‌రోడ్డులో అగాధాలు

- ప్రయాణికులకు తప్పనిపాట్లు
- పట్టించుకోని యంత్రాంగం

ఉప్పాడ(కొత్తపల్లి), జూన్ 24: బీచ్‌రోడ్డులో అడుగడుగునా ఏర్పడిన అగాధాలతో ప్రయాణికులు తీవ్ర గాయాలపాలవుతున్నారు. సముద్ర కెరటాలు బలంగా దూసుకొచ్చి బీచ్‌రోడ్డును తాకిన సందర్భాల్లో అక్కడక్కడా పెద్ద సైజు గుంతలు ఏర్పడ్డాయి. సముద్రంలో పోటు,పాట్లకు సముద్రపు నీరు రోడ్డుపై ఉన్న గంతలోకి చేరుతోంది. దీంతో రాత్రిపూట బైక్‌లపై ప్రయాణిస్తున్న వారు వాటిల్లో పడి గాయాలపాలవుతున్నారు. కూటమి ప్రభుత్వంలో గ్రామీణరోడ్లను అభివృద్ధి చేస్తారని ప్రజలు, ప్రయాణికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ముగ్గురు ఎంపీలు ప్రమాణం

తెలుగులో పురందేశ్వరి..
ఇంగ్లీష్‌లో హరీష్, ఉదయ్



దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం



గంటి హరీష్ మాధుర్ బాలయోగి, అమలాపురం



తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ

రాజమహేంద్రవరం అర్బన్/అమలాపురం/కార్పొరేషన్(కాకినాడ), జూన్ 24: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఎన్నికైన ముగ్గురు కూటమి పార్లమెంట్ సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ ప్రమాణస్వీకారం చేయించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం బీజేపీ ఎంపీగా ఎన్నికైన దగ్గుబాటి పురందేశ్వరి అనే నేను అంటూ తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అంటూ ముగించారు. అమలాపురం రిజర్వు లోక్‌సభ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన గంటి హరీష్ బాలయోగి ఆంగ్లంలో ప్రమాణపత్రాన్ని చదివారు. ప్రమాణ స్వీకారం అనంతరం హరీష్ ప్రొటెం స్పీకర్‌ను కలిశారు. పార్లమెంటులో టీడీపీ విప్‌గా ఇప్పటికే నియమితులైన హరీష్ చాంబర్‌లో కొలువుదీరారు. కాకినాడ పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఇంగ్లీష్‌లో ప్రమాణపత్రాన్ని చదివారు. తొలిసారి ఎంపీలుగా గంటి హరీష్ మాధుర్, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఎన్నికవడం గమనార్హం. రాజమహేంద్రవరం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎంపీ పురందేశ్వరి తెలిపారు. టీడీపీ ఎంపీ హరీష్ బాలయోగి మాట్లాడుతూ తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన కోనసీమ జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తానన్నారు. రానున్న రోజుల్లో కాకినాడ సరికొత్త అభివృద్ధి పథకాలతో వెలుగుతుందని ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ పార్లమెంట్ అభివృద్ధికి తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు.

బెండపూడిలో కొనసాగుతున్న
వైద్య శిబిరం

తొండంగి, జూన్ 24: డయేరియా నివారణ నిమిత్తం తొండంగి మండలం బెండపూడిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరం సోమవారం కూడా కొనసాగింది. కొత్త కేసులు రానప్పటికీ పాతకేసులకు సంబంధించిన రోగులు తదుపరి వైద్యంనిమిత్తం వచ్చి వైద్యసహాయం పొందుతున్నారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కుళాయి నీటిని నిలిపి వేసి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇంటింటి సర్వే కొనసాగుతోంది. ఆశవర్కర్లు, ఇతర వైద్య సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్నారు.

ఆ ఆరు రైళ్లు యథాతథం - 7వ పేజీ

జేఎన్టీయూకేలో ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూలు - 7వ పేజీ

నిరుపయోగమేనా?

- మూలకు చేరిన జగనన్న మక్కురాళ్లు
- పాతుకోవడానికి రైతుల అనాసక్తి
- బిల్లులు చేసుకున్న గుత్తేదారులు



కరప మండలం గొడ్డటిపాలెంలో మూలకు చేరిన మక్కు రాళ్లు

కరప, జూన్ 24: కోట్ల రూపాయల ప్రజాధనంతో గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా కొనుగోలు చేసిన మక్కురాళ్లు మూలకు చేరాయి. ఎక్కడికక్కడ డంప్ చేసిన ఈ మక్కురాళ్లపై జగన్ చిత్రాలు, పేర్లు ఉండడంతో వాటిని వినియోగించడానికి రైతులు ఆసక్తి కనబరచడంలేదు. దీంతో పొలం గట్టు, దిమ్మలపై అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకం కింద రీసర్వే చేసిన భూముల్లో ఈ మక్కురాళ్లను పాతడానికి అప్పట్లో అధికారులు కాంట్రాక్ట్‌కి ఇచ్చారు. రెవెన్యూశాఖలోని కిందిస్థాయి సిబ్బంది, వారి బినామీలు గుత్తేదారుల అవతారమెత్తి ఆ మక్కురాళ్లను పాతడానికి ముందుకొచ్చారు. రైతుల అయిష్టత, శివారు పొలాలకు పట్టుకెళ్లడానికి వీలు లేకపోవడం, రీసర్వేలోని లోపాలు, తదితర కారణాలతో మక్కురాళ్ల ఏర్పాటుకు విఘాతం కలిగింది. ఈలోగా రాళ్లు పాతినట్టుగా చూపించి గుత్తేదారులు, సిబ్బంది బిల్లులు చేసుకుని సొమ్ములు జేబులో వేసుకున్నారు. కొన్నిచోట్ల మక్కురాళ్లు కనిపించకుండా కాలువలు, చెరువు గర్భాల్లో పడేసినట్టుగా తెలుస్తుంది. కొన్ని గ్రామాల్లో మక్కురాళ్లను ఇళ్ల నిర్మాణాలు, మెట్లు ఏర్పాటుకు వినియోగించినట్టు సమాచారం. ఈ మక్కురాళ్లలో నాణ్యత లేకపోవడంతో పగిలిపోతున్నాయని, ఎండకు ఎండి వానకు తడిచి ధ్వంసమవుతున్నాయని రైతులు చెబుతున్నారు. పొలంగట్లపై పాతిన మక్కురాళ్లు దారికి అడ్డంగా ఉంటున్నాయనే కారణంతో పీకి పాడేస్తున్నారు. పేర్ల పిచ్చితో, లోపభూయిష్టమైన నిర్ణయాలతో జగన్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను రైతులు ఎండగడుతున్నారు. రాజుల సొమ్ము రాళ్లపాలు అన్నట్టు ప్రజాధనాన్ని ఇలా మక్కురాళ్ల పాల్జేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దారిమళ్లించిన, నిరుపయోగంగా ఉన్న ఈ మక్కురాళ్ల లెక్కతేల్చి ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగించాలని పలువురు కోరుతున్నారు.

రైళ్ల రద్దుతో రత్నగిరికి తగ్గనున్న భక్తుల తాకిడి

అన్నవరం, జూన్ 24: రైల్వేలైన్ మరమ్మతుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పలు రైళ్లను రద్దుచేసిన నేపథ్యంలో సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తుల తాకిడి తగ్గేలా ఉంది. సింహాద్రి, రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్నవరం పుణ్యక్షేత్రానికి అధికసంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు. రవాణా చార్జీలు తగ్గుతాయన్న ఉద్దేశ్యం, సుఖమయ ప్రయాణం కారణంగా అధికసంఖ్యలో భక్తులు రైళ్ల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం పలు రైళ్లు రద్దు నేపథ్యంలో రత్నగిరికి వచ్చే భక్తుల సంఖ్య తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

స్కూల్ కిట్ల స్టాకు పాయింటు పరిశీలించిన జీసీడీవో

తొండంగి, జూన్ 24: తొండంగి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్కూల్ కిట్ల స్టాకు పాయింటును జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి పి.ఉమామహేశ్వరి సోమవారం పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి స్టాకును పరిశీలించారు. త్వరితగతిన పుస్తకాలు ఇతరవస్తువులను పాఠశాలలకు చేర్చి విద్యార్థులకు అందించాలన్నారు. షూలగ్రేడింగ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. సీఆర్పీలు ప్రతాపరెడ్డి, మీరా సాహెబ్, శీల ఉన్నారు.

గోదావరినీ వదలని 'షెకావత్'



మైదాన మత్స్యకారులతో గిరిజన మత్స్యకారుల వాగ్వాదం

ఆయన జమానాలో నిర్వాసిత మత్స్యకార్ల హక్కులను అమ్మేసిన అటవీ అధికారులు

లంకలను అడ్డా చేసుకుని గోదావరి రెండు ఒడ్డుల మధ్య మత్స్య సంపద దోపిడీ

లైసెన్సులు ఉన్న నిర్వాసితులను అణచివేసి అంతర్రాష్ట్ర వేటగాళ్లకు ప్రోత్సాహం

(ఆంధ్రజ్యోతి నిఘా విభాగం):

రంపచోడవరం అటవీ డివిజన్‌లో షెకావత్ అవతారమెత్తిన అటవీ అధికారి తన బృందం అక్రమాలకు అటవీ సంపదనే కాకుండా పాపికొండల అభయారణ్యంలోని గోదావరి పరివాహక ప్రాంతాన్నీ వదలలేదు. కాదేది అక్రమాలకు అనర్హం అన్న చందంగా గోదావరి పరివాహక ప్రాంతంలో పోలవరం ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే గ్రామాలు ఖాళీ కావడంతో అక్కడ అక్రమాలకు తెరతీశారు. గోదావరిలో మత్స్య సంపద వేట హక్కులను కలిగిన నిర్వాసిత గిరిజనులపై ఆంక్షలు విధించి అంతరాష్ట్ర మత్స్య వేటగాళ్లకు గోదావరిపై గిరిజనులకు ఉన్న హక్కులను అమ్మేశారు. వివరాల్లోకి వెళితే...పోలవరం నిర్మాణంతో ముంపునకు గురయ్యే గ్రామాల గిరిజన నిర్వాసితులకు చట్ట ప్రకారం పునరావాస చర్యలలో భాగంగా గోదావరిలో చేపల వేట హక్కులను మంజూరు చేశారు. లైసెన్సులను కూడా అందించారు. నిర్వాసిత గిరిజనులు సంప్రదాయబద్ధంగా మత్స్య సంపద మనుగడ దెబ్బ తినకుండా వేట సాగించేవారు. క్రమం తప్పకుండా చేప పిల్లలను గోదావరిలో వదిలేవారు. ఈ చర్యలతో గోదావరిలో మత్స్య సంపద పెరగడంతో దళారీల కన్ను పడింది. దీంతో కొంతమంది దళారులు మైదాన ప్రాంతాల నుంచి మత్స్యకారులను రహస్యంగా గోదావరి అవతల ఒడ్డు నుంచి, కాఫర్ డ్యామ్ ద్వారా రప్పించి రహస్య వేట సాగించడం మొదలుపెట్టారు. రాను రాను ఇది గోదావరిలో మత్స్య సంపద దోపిడీ ముఠాగా మారింది. ఇది క్రమేణా గిరిజన నిర్వాసిత మత్స్యకారుల మనుగడను, గోదావరిలో మత్స్య సంపద మనుగడను దెబ్బతీసేలా పరిణమించింది. చేప పెరగకుండానే పిల్లలుగా ఉన్నప్పుడే వేటాడేస్తున్నారు. గోదావరిలో సాగుతున్న అంతరాష్ట్ర మత్స్యకారుల దోపిడీ వేటను నిరోధించాలని గిరిజన నిర్వాసితులు అటవీ అధికారులకు, పోలీసు అధికారులకు, ఐటీడీఏకు ఎన్ని ఫిర్యాదులు చేసినా, ఎన్ని ఆందోళనలు చేసినా గత ప్రభుత్వ అండదండల కారణంగా ఎటువంటి చర్యలూ లేవు. మొక్కుబడిగా కొన్ని పడవలను స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయంలో ఉంచుకుని ఊరుకున్నారు. అంతేకాక ఈ దోపిడీని నిరోధించాల్సిన అటవీ శాఖ ఉన్నతాధికారులే దీనిని ప్రోత్సహించడం, ఈ దోపిడీని ఎదురించే గిరిజన మత్స్యకారులను ఇబ్బందులు పెట్టడం, పాపికొండల అభయారణ్యం పేరుతో గిరిజనులపైనే అటవీ చట్టాలను ప్రయోగించడం తదితర చర్యలతో గిరిజనుల అడ్డు లేకుండా చేసి తద్వారా పరోక్షంగా అక్రమ దందాకు వంత పాడుతున్నారు. అటవీశాఖాధికారులు, ఇతర సంబంధిత అధికారులు ఈ దోపిడీ వెనుక ఉన్న దళారీల ద్వారా లబ్ధిపొందుతూ వచ్చారు. అంతే కాకుండా గిరిజనుల ఆటోను స్వాధీనం చేసుకుని చలానా కట్టించుకుని, వారి వలలను స్వాధీన పర్చుకుని దళారీ వద్దనే ఉంచి గిరిజనులు వేటాడకుండా చేశారు. ఈ మొత్తం బాగోతం వెనుక ఇటీవల కాలంలో అటవీశాఖలో టేకు చెట్ల నరికివేతతో పాటు పలు అక్రమాలను ప్రోత్సహించిన ఓ ఉన్నతాధికారే ఉండటం ఎవరినీ ఆశ్చర్యపర్చడం లేదు. కాగా ఊహించని రీతిలో రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడం ఈ అక్రమార్కులకు, వారిని ప్రోత్సహించే అధికారులకు మింగుడుపడనిదిగా మారింది. దీంతో కొత్త పాలన, కొత్త అధికారుల రాకతో గిరిజన నిర్వాసితులలో కూడా ఈ అక్రమార్కుల పీడ వదిలిపోతుందన్న ఆశలు చిగురిస్తున్నాయి.



వేటాడిన చేపలు



అటవీ శాఖ స్వాధీనంలో ఉన్న పడవలు

ఆరు రైళ్లు యథాతథం

రద్దైన రైళ్ల జాబితా నుంచి మినహాయింపు



రాజమహేంద్రవరం,(ఆంధ్రజ్యోతి)/సామర్లకోట, జూన్ 24: కడియం-నిడదవోలు రైల్వే లైన్ల మధ్య మరమ్మతు పనుల నిమిత్తం మొత్తం 26 రైళ్లను సోమవారం నుంచి తాత్కాలికంగా రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువడగా ప్రయాణికుల ఆగ్రహంతో రైల్వేశాఖ వెనక్కి తగ్గింది. కొన్ని రైళ్లకు రద్దు జాబితా నుంచి మినహాయింపు ఇచ్చింది. మొత్తం ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 25 నుంచి యథావిధిగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నట్లు రైల్వే పీఆర్వో (విజయవాడ) నస్రత్ మండ్రూప్‌కర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

12805 నంబరు గల విశాఖ-లింగంపల్లి మధ్య రాకపోకలు సాగించే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ముందుగా చేసిన ప్రకటన మేరకు ఈ నెల 23 నుంచి 10 ఆగస్టు వరకూ, తిరిగి 16 సెప్టెంబరు నుంచి 15 అక్టోబరు వరకూ రద్దు చేయగా సోమవారం రాత్రి అందిన ఉత్తర్వులు మేరకు ఈ నెల 25 మంగళవారం నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుందని పీఆర్వో మండ్రూప్‌కర్ తెలిపారు. ఇదే రీతిలో రద్దు అయిన 12806 నంబరు గల లింగంపల్లి-విశాఖల మధ్య రాకపోకలు సాగించే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ఈ నెల 26 నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుందని తెలిపారు.

17643 నంబరు గల చెంగల్పట్టు-కాకినాడల మధ్య రాకపోకలు సాగించే సర్కార్ ఎక్స్‌ప్రెస్ గతంలో ప్రకటించిన విధంగా 10 ఆగస్టు వరకూ రద్దు చేయగా తాజాగా అందిన ఆదేశాల మేరకు ఈ నెల 25 నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుంది. ఇదే రీతిలో 17644 నంబరు గల కాకినాడ-చెంగల్పట్టు మధ్య రాకపోకలు సాగించే సర్కార్ ఎక్స్‌ప్రెస్ కూడా ఈ నెల 25 నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుందని పేర్కొన్నారు.

17258 నంబరు గల కాకినాడ-విజయవాడల మధ్య రాకపోకలు సాగించే రైలు ముందుగా ప్రకటించిన మేరకు 15 అక్టోబరు వరకూ రద్దు చేయగా తాజాగా అందిన ఆదేశాల మేరకు మంగళవారం నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుంది. అలాగే 17257 నంబరు గల విజయవాడ-కాకినాడ మధ్య రాకపోకలు సాగించే రైలు కూడా మంగళవారం నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుందని ప్రయాణికులు గమనించాలని పీఆర్వో మండ్రూప్‌కర్ తెలిపారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తికి 15 ఏళ్ల జైలు

అమలాపురం టౌన్, జూన్ 24: బాలికకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసిన వ్యక్తికి కాకినాడ పోక్సో కోర్టు 15 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.7 వేలు జరిమానా విధించినట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రాంతంలో దళిత బాలికకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో కరెళ్ల గణపతి అనే వ్యక్తి మత్తు పానీయాలు ఇచ్చి బలవంతంగా అనుభవించాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్తే చంపేస్తానని బెదిరించాడు. కొద్ది రోజులకే బాలిక గర్భవతి కాగా గుర్తించిన తల్లిదండ్రులు 2018 ఏప్రిల్ 2న గణపతిపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ఈ కేసును దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. స్పెషల్ కోర్టు ఫర్ స్పీడీ ట్రయల్ ఆఫ్ అఫెన్సెస్ అండర్ పోక్సో యాక్టు-2012 కాకినాడ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు ట్రయల్ నిర్వహించి ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో కరెళ్ల గణపతికి శిక్ష విధిస్తూ జడ్జి కె.శ్రీదేవి సోమవారం తీర్పు చెప్పారు. కేసు దర్యాప్తులో కృషి చేసిన అప్పటి ఎస్ఐ జి.సురేంద్ర, దర్యాప్తు అధికారి ఎం.వెంకటేశ్వరరావును ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

యువతి తన ప్రేమను అర్థం చేసుకోలేదని యువకుడి ఆత్మహత్య

కొత్తపల్లి, జూన్ 24: తన ప్రేమను అర్థం చేసుకోకుండా తనపై ఓ యువతి తరపున పోలీసు కేసు పెట్టడాన్ని జీర్ణించుకోలేని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపల్లి మండలం కొండెవరం శివారు ఇందిరానగర్లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... కొత్తపల్లి మండలం కొండెవరం శివారు ఇందిరానగర్‌కు చెందిన బండి చక్రధర(26) ఓ యువతిని 2021లో ప్రేమించాడు. దీంతో యువతి హైదరాబాద్ వెళ్లిపోయింది. యువతి అక్కడ నుంచి ఇటీవల ఇందిరానగర్ పరీక్షలు రాయడానికి వచ్చింది. మళ్లీ తన కూతురి దగ్గరకు చక్రధర వస్తాడనే అనుమానంతో యువతి తల్లి కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మనస్తాపం చెందిన చక్రధర ఇంట్లోనే ఆత్మహత్య చేసుకొన్నాడని పోలీసులు తెలిపారు. యువకుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నిషేధిత సిగరెట్ ప్యాకెట్లపై విజి'లెన్స్'

రూ.16.41లక్షల విలువైన ప్యాకెట్లు స్వాధీనం

అమలాపురం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): నిషేధిత సిగరెట్ ప్యాకెట్లు విక్రయిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్ అధికారులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ప్రధానంగా మూడు దుకాణాలపై దాడులు జరిపి రూ.16,41,530 విలువైన సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సంబంధిత యజమానులపై మూడు కేసులు నమోదు చేసినట్టు రీజనల్ విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపారు. అమలాపురం పట్టణంలోని గొల్లగూడెం బైపాస్ రోడ్డు రామకృష్ణ వీధిలోని ఎంఎస్ నిషిక ఎంటర్‌ప్రైజెస్‌పై తొలుత దాడులు జరిపారు. ఏడు బ్రాండ్లకు సంబంధించి నిషేధిత సిగరెట్లను గుర్తించి రూ.14,33,600 విలువైన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలు చేస్తున్న షాపు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు కోసం అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. కాకినాడ జిల్లా తాళ్లరేవుకు చెందిన నున్న వెంకట బుచ్చిరాజు గుంటూరుకు చెందిన వెంకట్ అనే వ్యక్తి నుంచి నిషేధిత సిగరెట్లను సేకరించి తన అల్లుడైన ఎన్వీఆర్ఎస్ఎస్ శోభిత్ ద్వారా ఎంఎస్ నిషిక ఎంటర్‌ప్రైజెస్ వ్యాపార ప్రాంగణంలో ఉంచి రిటైల్ విక్రయాలు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. సిగరెట్ ప్యాకెట్లపై చట్టబద్ధమైన వివరాలను ప్రకటించనందున లీగల్ మెట్రాలజీ అధికారులు ఎల్ఎం యాక్టు-2009 కింద కేసు నమోదు చేశారు. అనంతరం ఎర్రమిల్లి వారి వీధిలోని ఎంఎస్ వరలక్ష్మి జనరల్ మర్చంట్స్‌ను తనిఖీ చేయగా నిషేధిత సిగరెట్ ప్యాకెట్లయిన హార్బర్ గోల్డ్, గోల్డ్ ఫిల్టర్, గోల్డ్ విమల్ తదితర 2,080 ప్యాకెట్లను గుర్తించారు. వీటి విలువ రూ.1,09,200గా నిర్ధారించారు. షాపు యజమాని జీఎస్టీ సైతం నమోదు చేసుకోలేదు. స్టాకుకు సంబంధించిన ఖాతాల పుస్తకాలు, కొనుగోలు అమ్మకాల బిల్లులు నిర్వహించట్లేదని జీఎస్టీ అధికారులు గుర్తించారు. అనంతరం అదే వీధిలోని శ్రీదేవి జనరల్ స్టోర్స్‌లో తనిఖీలు జరిపి రూ.1,98,730 విలువైన 3,873 నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆయా షాపుల యజమానులపై కేసుల నమోదుకు సిఫార్సు చేశారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు పి.ముత్యాలనాయుడు, శ్రీనివాసరెడ్డి, నాగవెంకటరాజు, భార్గవమహేష్, లక్ష్మీనారాయణ, నవీన్‌కుమార్, జగన్నాథరెడ్డి, జీవా, లోవరాజు, వలీ, వీరబాబు, కిశోర్ పాల్గొన్నారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న సిగరెట్ ప్యాకెట్లు

జేఎన్టీయూకేలో ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూలు



సమీక్ష నిర్వహిస్తున్న ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు

ఈనెల 27 వరకు నిర్వహణ

జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు సమీక్ష

జేఎన్టీయూకే, జూన్ 24: ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఆర్‌సెట్) 2023-24లో రాష్ట్రవ్యాప్తంగా ఈఈఈ,ఈసీఈ విభాగాల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు వర్సిటీ ప్రాంగణంలో ఇంటర్వ్యూలు సోమవారం ప్రారంభమయ్యాయని, ఈనెల 27 వరకూ కొనసాగుతాయని ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ సమావేశ హాల్లో పరిశోధనాభివృద్ధి డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో వీసీ పాల్గొని బీఓఎస్ చైర్మన్‌లు, విభాగాధిపతులు, ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ సభ్యులతో ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూల నిర్వహణపై పలు సూచనలు చేశారు. వీసీ మాట్లాడుతూ ఈ ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులను మెరిట్ లిస్ట్, రోస్టర్ పాయింట్స్ ప్రాతిపదికన 2023-24 విద్యాసంవత్సరానికిగాను పీహెచ్‌డీ కోసం ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈఈఈ విభాగానికి 225 మందికి మూడురోజులపాటు, ఈసీఈ విభాగానికి 364 మందికి నాలుగు రోజుల పాటు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఈఈఈ విభాగానికి సంబంధించి సోమవారం 75 మందికి, ఈసీఈ విభాగానికి సంబంధించి 90 మందికి అడ్మిషన్స్, పరిశోధనాభివృద్ధి డైరెక్టరేట్ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, ఓఎస్డీ కోటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్ (డీఏఏ) సీహెచ్ సాయిబాబు, ఐక్యూఏసీ డైరెక్టర్ ఎన్.బాలాజీ, డీఏపీ వెంకటరెడ్డి, ఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ పాల్గొన్నారు.

వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడిగా చామర్తి కన్నబాబు



చామర్తి కన్నబాబు, సవితాల వీరబాబు, మొకరాల రాజేష్

అన్నవరం, జూన్ 26: అన్నవరం దేవస్థానం వ్రతపురోహితసంఘ ఎన్నికలు సోమవారం సాయంత్రం రత్నగిరిపై జరగగా కార్యవర్గాన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చామర్తి కన్నబాబు ఎన్నికయ్యారు. సుమారు 30 సంవత్సరాలుగా వ్రత పురోహితుడిగా వివిధ గ్రేడ్‌లలో సేవలందించడంతో పాటుగా ప్రస్తుతం దేవస్థానం కల్యాణబ్రహ్మగాను గతంలో 2017-18 లో వ్రత పురోహిత సంఘ అధ్యక్షుడిగా కన్నబాబు వ్యవహరించారు. 2022-23లో దేవస్థానం వైదిక కమిటీలో పనిచేశారు. కార్యదర్శిగా సవితాల వీరబాబు, కోశాధికారిగా మొకరాల రాజేష్‌ను ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ వ్రత పురోహితుల సమస్యలు పరిష్కరించడంతో పాటుగా పదవీ విరమణ పొందిన పురోహితులకు, వారి కుటుంబ సభ్యులకు అందించే సౌకర్యాలను సకాలంలో అందేలా చూస్తానని చెప్పారు.



2 వేల క్యూసెక్కుల నీరు విడుదల

సీలేరు, జూన్ 24: ఖరీఫ్ పంటలు, తాగునీటి అవసరాల కోసం గోదావరి డెల్టాకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఏపీ జెన్‌కో ఎస్ఈ కేకేవీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి జలాశయం నుంచి జెన్‌కో అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జలవనరుల శాఖ అధికారుల అభ్యర్థన మేరకు సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి నుంచి రెండు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు. అలాగే పవర్ కెనాల్ ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం నాలుగు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు. ఈ మేరకు గోదావరి డెల్టాకు ఆరు వేల క్యూసెక్కుల నీరు వెళుతుందని ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయంలో 12.5 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు.

పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ ప్రక్రియను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ సుధాకర్

దివాన్‌చెరువు, జూన్ 24: ఏపీఆర్ సెట్‌లో అర్హత సాధించిన వారికి జియాలజీ, మేనేజ్మెంట్ విభాగాల్లో ప్రవేశాలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూ ప్రక్రియను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి జియాలజీ, విభాగంలో 30 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా మేనేజ్మెంట్ విభాగంలో 320 మందికి గాను 80 మందికి జరిగాయన్నారు. మిగిలిన వారికి ఈ నెల 27వ తేదీ వరకూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు సెట్ కన్వీనర్ సూచనల ప్రకారం సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో జియాలజీ, మేనేజ్మెంట్ ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పాదాలమ్మ తల్లి

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 38 అర్జీలు

వివిధ సమస్యలపై అర్జీలు అందించిన ప్రజలు

త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని పీవో ఆదేశాలు



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, ఇతర అధికారులు

రంపచోడవరం, జూన్ 24: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం కార్యక్రమంలో సుమారు 38 అర్జీలు అందాయని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్, ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి పీవో అర్జీలను స్వీకరించారు. దేవీపట్నం మండలం తున్నూరు పంచాయతీ పరిధిలోని గ్రామాలకు సెల్ టవర్ ఏర్పాటు చేయాలని, మారేడుమిల్లి మండలం వైదపూడిలో పాఠశాల భవనం నిర్మించాలని, తాడేపల్లి-సద్దిరేవుల వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, పోలవరం ప్రాజెక్టు తొయ్యేరులోని 18 ముంపు బాధితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, వికలాంగుల పింఛను మంజూరు చేయాలని, నేషనల్ హైవేలో స్థలాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించాలని కోరుతూ దరఖాస్తులు అందాయన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే మాట్లాడుతూ వచ్చిన అర్జీలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలకు పంపించాలన్నారు. ప్రతి అర్జీ త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, పశుసంవర్ధకశాఖ డీడీ షరీఫ్, డీఈవో మల్లేశ్వరరావు, వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, డీఎల్‌పీవో రాఘవన్, ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామికి విశేష పూజలు



సామర్లకోట, జూన్ 24: సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామికి సోమవారం పంచద్రవ్యాలతో అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, వెంకన్న, అంజిబాబు, శ్రీనివాసరావు, వినయ్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేక పూజలు, విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు, విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్వామివారికి, అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకంలో సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదానం నిర్వహించగా ఆలయం వెలుపల భీమేశ్వర అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది భక్తులు అన్నదానం స్వీకరించారు.



పాదాలమ్మ తల్లికి తిరుప్పావడ సేవ

గొల్లప్రోలు, జూన్ 24: కాకినాడ జిల్లా గొల్లప్రోలు రైల్వేస్టేషన్ వద్ద కొలువయి ఉన్న పాదాలమ్మ తల్లికి సోమవారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. గ్రామదేవతా విరాజిల్లుతున్న పాదాలమ్మ వారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఈ సేవ జరిగింది. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

APS RTC
టెండరు ప్రకటన
పల్లె వెలుగు
https://apsrtc.ap.gov.in లో tenders ... APSRTC
నెం. S2/437(02)/2024-DPTO/EG, తేది:21-06-2024 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

అంగన్‌వాడీ పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 24: కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో జగన్నాథపురం-2 సెక్టార్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో సెక్టార్ సూపర్‌వైజర్ కేఎస్ అరుణశ్రీ ఆధ్వర్యంలో పిల్లలకు సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతిలో చేర్పించేందుకు తల్లిదండ్రులందరికీ అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ హెచ్‌ఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇంగ్లీషు మీడియం అందుబాటులో ఉందన్నారు.

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

» కాకినాడ ఇన్‌చార్జి కమిషనర్ » పలుచోట్ల 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'



కార్పొరేషన్: ప్రజా ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 24: ప్రజల నుంచి వచ్చిన ప్రతీ ఫిర్యాదుకు సత్వర పరిష్కారాన్ని అందిస్తామని కాకినాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ ఎస్‌ఈ వి.సత్యకుమారి చెప్పారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఫోన్ ద్వారా వచ్చిన వినతులను సత్యకుమారి స్వీకరించారు. డంపింగ్ యార్డు, పారిశుధ్యం, వీధి దీపాల సమస్య వంటి 26 సమస్యలను ప్రజలు ఫోన్ ద్వారా వివరించారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాల్సిందిగా ఆమె ఆదేశించారు. అనంతరం 10.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులను నేరుగా స్వీకరించారు. మొత్తం ఆరుగురు వివిధ సమస్యలపై దరఖాస్తులు అందజేయగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, స్మార్ట్ సిటీ ఎస్‌ఈ వెంకటరావు, ఈఈ మాధవి, మేనేజర్ కర్రి సత్యనారాయణ ఉన్నారు.

కాకినాడ సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి అర్జీదారులు వచ్చి సమస్యలు విన్నవించుకున్నారు. కార్యాలయ పరిపాలనాధికారి పాల్గొన్నారు.

పెద్దాపురం: ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఇకపై వారంవారం నిర్వహిస్తుందని ఆర్డీవో జె.సీతారామారావు తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి 8 అర్జీలను స్వీకరించారు. వచ్చిన ప్రతీ అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి దానిని పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. డీఎల్పీవో బాలామణి, డీటీ భానూకుమార్ ఉన్నారు.

పిఠాపురం: పట్టణంలో అధ్వాన పారిశుధ్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పారిశుధ్యం మెరుగుకు తక్షణం చర్యలు తీసుకోవాలని పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో టీడీపీ కౌన్సిలర్, నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు పంపన బోయిన అన్నపూర్ణ అధికారులకు వినతి ఇచ్చారు.

ఏలేశ్వరం: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీవో అరుణ, ఏవో జ్యోతి, ఎంఈవో వరలక్ష్మీ, ఐసీడీఎస్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం : చినరాజప్ప



ధ్రువపత్రాలను అందజేస్తున్న రాజప్ప

పెద్దాపురం, జూన్ 24: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. పట్టణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నారులకు పాఠశాల అంటే భయం పోగొట్టి వారిని ఆరోగ్యవంతగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం ఎంత గానో దోహదపడుతుందన్నారు. పలువురు టీడీపీ నేతలు, ఉద్యోగులు రాజప్పను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, తూతిక రాజు, కొరిపూరి రాజు, ఐసీడీఎస్ అధికారులు ఉన్నారు.

డయేరియా బాధితులకు పరామర్శ

సామర్లకోట: వేట్లపాలెం గ్రామంలో డయేరియా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించారు. ఇంకనూ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి యోగక్షేమాలను రాజప్ప తెలుసుకుని మరింత మెరుగైన చికిత్సలు అందించేలా వైద్యఆరోగ్య అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి గ్రామంలో ఐదుగురిలో డయేరియా లక్షణాలు కనిపించగా స్థానిక, కాకినాడ ఆసుపత్రికి పంపారు.

ఎమ్మెల్యే నానాజీకి నేమ్ బోర్డు బహూకరణ



నేమ్ బోర్డు అందజేస్తున్న నాయకులు

సర్పవరం జంక్షన్, జూన్ 24: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీకి సోమవారం గొడారిగుంటలో నానాజీ నివాసంలో గంగనాపల్లికి చెందిన పార్టీ నాయకులు కుర్రా నాగేశ్వరరావు, శిరంగు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానాజీ పేరుతో తయారు చేయించిన నేమ్ బోర్డును అందించారు. పార్టీ నాయకులు కరెడ్ల గోవిందు, పాండ్రంకి రాజు, శాండీ పాల్గొన్నారు. పంతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రేపూరుకు చెందిన విజయలక్ష్మి, నాగవీరలక్ష్మిలకు ఎమ్మెల్యే కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కోట్ల డిపాజిట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి సొసైటీ మాజీ చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులకు సెజ్‌లో ఉన్న 18.36 ఎకరాల భూమికి సర్వే చేపట్టి సొసైటీకి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆ సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు ఎమ్మెల్యే నానాజీని కోరారు. గొడారిగుంటలో ఎమ్మెల్యే నివాసంలో సొసైటీ పాలవర్గ సభ్యులతో కలసి వినతి అందించారు.

అందరి సహకారంతో కాకినాడ అభివృద్ధి : ఎమ్మెల్యే



కొండబాబుకు అభినందన దృశ్యం

కాకినాడ సిటీ, జూన్ 24: అందరి సహకారంతో కాకినాడ స్మార్ట్ సిటీని అభివృద్ధి చేస్తామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. కొండబాబును సోమవారం ఆయన నివాసంలో పలువురు ప్రముఖులు, వివిధ వర్గాల వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్లు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కాంట్రాకర్లు అమ్మ ట్రేడింగ్ నాగేశ్వరరావు, ఎన్.వర్మ, అమలకంటి బుజ్జి, చిట్టిబాబు, జి.సుందర్‌కుమార్, నక్క శ్రీను, పెంటా రాంబాబు, జె.చలపతి, జి.కృష్ణ పాల్గొన్నారు.

'వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి'

కరప, జూన్ 24: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, సచివాలయాల, ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఆయన మాట్లాడారు. జిల్లాలో డయేరియా కేసులు నమోదవుతున్న దృష్ట్యా తరచుగా వాటర్ ట్యాంక్‌ల క్లీనింగ్, క్లోరినేషన్ చేయించాలని, తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పారిశుధ్యం పాటించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వీవీఎస్ వర్ధన్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో జీవీ రమణకుమార్, ఈవోపీఆర్డీ బసవరాజు సత్యనారాయణ పాల్గొన్నారు.

'మెస్ చార్జీలను పెంచాలి'

పిఠాపురం, జూన్ 24: రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని ఆల్ ఇండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్(అప్సా) చైర్మన్ డాక్టర్ పిల్లా చంద్రం డిమాండ్ చేశారు. పట్టణంలోని డాకర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆయన సోమవారం అప్సా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొండపాటి విద్యాసాగర్‌తో కలిసి సందర్శించారు. విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి మెస్‌చార్జీలు పెంచేలా చర్యలు తీసుకోవాలని చంద్రం విజ్ఞప్తి చేశారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ఏలేశ్వరం, జూన్ 24: మండలంలోని రమణయ్యపేట, తూర్పులక్ష్మీపురం, జె.అన్నవరం, తిరుమాలి, ఎర్రవరం, మర్రివీడు, సి.రాయవరం, పెద్దనాపల్లి గ్రామాలతో పాటు పట్టణంలో ఖరీఫ్ సీజన్‌కు రైతులకు విత్తనాలను కౌన్సిలర్ అలమండ చలమయ్య, టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, ఏవో బి.జ్యోతి పంపిణీ చేశారు. ఏవో మాట్లాడుతూ కిలో వరి విత్తనాలను రూ.5 చొప్పున సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం రైతులకు అందిస్తుందన్నారు. సర్పంచ్‌లు సూతి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు సూరిబాబు, పలివెల శ్రీనివాస్, సూతి అప్పలరాజు పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలో టీడీపీ నేతలు అన్ని సచివాలయాలు నందు రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందజేశారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, ఏవో రెడ్డి ఈశ్వరరావు, పసగడుగుల రమణ, ఉండ్రాజుదివాణం, జేట్లా రాజా పాల్గొన్నారు.

శంఖవరం: మండల గ్రామాల్లో సచివాలయాల వద్ద టీడీపీ నేతలు రైతులకు వరి విత్తనాలు అందజేశారు. పర్వత సురేష్, వెన్నాశివ, బద్దిరామారావు, సుభాష్ ఉన్నారు.

రేపు ఎమ్మెల్యే సత్యప్రభ విజయోత్సవ ర్యాలీ

ప్రత్తిపాడు, జూన్ 24: ప్రత్తిపాడు నియోజకవర్గంలో బుధవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేపట్టి నియోజకవర్గానికి బుధవారం వస్తున్న సత్యప్రభకు యర్రవరం వద్ద భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలుకుతామని నిర్వాహకులు తెలిపారు. ర్యాలీ యర్రవరం నుంచి ప్రత్తిపాడు వరకు కొనసాగుతుందని, ర్యాలీని విజయవంతం చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని వారు కోరారు.

28న ఐటీఐలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 24: ఐటీఐ ఫైనల్ ఎగ్జామ్స్ రాస్తున్న అన్ని ట్రేడ్ల విద్యార్థులకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 28న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎంవీజీ వర్మ తెలిపారు. ఐటీసీ లిమిటెడ్ మెదక్, ఏపీ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, లైఫ్ మెకానిక్స్ హైదరాబాద్, రానే బ్రేక్ లివింగ్ లిమిటెడ్ హైదరాబాద్, అరవిందో ఫార్మా తుని కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. 600 ఖాళీలను భర్తీ చేయనున్నారన్నారు. విద్యార్థులందరూ తమ బయోడేటాతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

రక్తదానం చేసినవారికి అభినందన



పోర్టుసిటీ (కాకినాడ), జూన్ 24: టీడీపీ నాయకుడు మల్లాడి ఏడుకొండలు ద్వితీయ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రక్తదానం చేసిన యువకులను సోమవారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కుమారుడు వనమాడి మోహనవర్మ అభినందించారు. స్థానిక 37వ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో ఏడుకొండలు కుమారుడు మల్లాడి నూకేష్‌వర్మ ఆధ్వర్యంలో 100మంది పైగా యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. నూకేష్‌వర్మను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ, నగర మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ రహీమ్, పి.ధర్మారావు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న జనసైనికులు

కరప, జూన్ 24: కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా పంతం నానాజీ ఘన విజయం సాధించడంతో జనసేన పార్టీ కరప మండలాధ్యక్షుడు బండారు మురళి నేతృత్వంలో పలువురు జనసైనికులు సోమవారం తిరుపతి వెళ్లి తలనీలాలు సమర్పించి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తుమ్మలపల్లి గోవిందరాజులు, ముద్రగడ రమేష్ ఉన్నారు.

కాకినాడరూరల్ ఎమ్మెల్యే నానాజీని సోమవారం ఏపీఎన్‌జీజీవో కరప యూనిట్ కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘాధ్యక్షుడు బీఆర్‌వీ చౌదరి, కార్యదర్శి కె.వెంకటరత్నం, సభ్యులు కనక నాగేంద్రకుమార్, కె.రాఘవకుమార్, బి.సుజాత, పి.చంద్రకళ, ఎస్.నాగమణి, కేశవరావు ఉన్నారు. వేళంగి పీహెచ్‌సీ వైద్యురాలు ఎంకే సౌజన్య, సిబ్బంది ఎమ్మెల్యేని కలిసి అభినందించారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఎస్పీ



సదస్సులో ఎస్పీ సతీష్‌కుమార్, అధికారులు

గండేపల్లి, జూన్ 24: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. సూరంపాలెం ఆదిత్య కళాశాల ప్రాంగణం నందు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలు అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఎస్పీ, పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి ముఖ్యఅతిథులుగా మాట్లాడారు. విద్యార్థులంతా మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా విద్యపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు, గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ, డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కుమార్, డీన్స్ డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ సుబ్బారావు ఉన్నారు.

'మాదకద్రవ్యాలతో పట్టుబడితే చట్టరీత్యా కఠినచర్యలు'

కాకినాడ రూరల్, జూన్ 24: ఎవరైనా సరే మాదకద్రవ్యాలతో పట్టుబడితే చట్టరీత్యా కఠినచర్యలుంటాయని కాకినాడ రూరల్ ఇంద్రపాలెం సౌత్ సెబ్ సీఐ ఆర్జే సతీష్‌బాబు తెలిపారు. కాకినాడ సౌత్ ఎస్‌ఈబీ, ఎస్‌హెచ్‌వో ఆధ్వర్యంలో కాకినాడ గాంధీనగర్‌లో గల మహాత్మాగాంధీ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల 9,10వ తరగతి విద్యార్థులకు సోమవారంమాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై వివరించి, ఉపాధ్యాయుల ఉపన్యాసం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఎస్ఐ బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

'అనర్థాలను గ్రహించి దూరం కండి'

యండమూరు (కరప), జూన్ 24: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గ్రహించి వాటికి దూరంగా ఉండాలని తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఎస్ఐ టి.చిట్టిబాబు సూచించారు. యండమూరులో సోమవారం కరప ఎస్ఐ టి.రామకృష్ణతో కలిసి ఆయన అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలను వినియోగించినా, కలిగి ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్పంచ్ మారెళ్ల శివ, టీడీపీ నాయకుడు సర్వశిద్ది ఏడుకొండలు, ఎస్‌ఈబీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ

ప్రత్తిపాడు, జూన్ 24: మాదకద్రవ్యాల నిర్మూలపై ప్రత్తిపాడులో సోమవారం సెబ్ అధికారులు, కమ్యూనిటీ హెల్త్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ర్యాలీని సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య ప్రారంభించారు. సెబ్ సీఐ ఎల్.చిరంజీవి, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.


నేను బడికిపోతా కార్యక్రమాలు

సామర్లకోట, జూన్ 24: మండల విద్యా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మండలం, పట్టణంలోనూ నేను బడికి పోతా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఈవో వై.శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో మండలంలోని గొంచాల ఎంపీపీ పాఠశాల, సామర్లకోటలోని బీబీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, కరపచెరువు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశాలు నిర్వహించారు. 45 మంది చిన్నారులను పాఠశాలలో చేర్చేందుకు అడ్మిషన్లు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుల్తానాబీబీ, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, అంగన్‌వాడీ సిబ్బంది బీ.రత్న కుమారి, పద్మ, చిన్న సూర్యప్రభ ఉన్నారు.

సౌండ్ సిస్టమ్ బహూకరణ

కాకినాడ సిటీ, జూన్ 24: రోటరీ ఆశ్రయ వృద్ధాశ్రమంలో నూతనంగా నిర్మించిన ధ్యాన మందిరానికి సానా సతీష్‌బాబు ఫౌండేషన్, హరీష్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రూ.30వేల విలువైన సౌండ్ సిస్టమ్, చైర్లను సోమవారం బహూకరించారు. కార్యక్రమానికి ఆశ్రయ వృద్ధాశ్రమం చైర్మన్ టీవీఎస్.ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ విచ్చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి సుబ్బారావు, క్లబ్ సభ్యులు డాక్టర్ టీవీ బాలకృష్ణ, చార్మినార్ వర్మ, మమతా శ్రీనివాస్, ఆదిత్య, చందు, సాంబమూర్తి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడికి సపర్యలు



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధుడు

కరప, జూన్ 24: కాకినాడ-కోటిపల్లి ప్రధానరహదారిలో పెద్దాపురప్పాడు గ్రామ శివారున సోమవారం గుర్తుతెలియని ఒక వృద్ధుడు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తూ రోడ్డుపక్కన సొమ్మసిల్లి పడిపోయాడు. కొంతమంది గ్రామస్తులు వెంటనే అతడి వద్దకు వెళ్లి సపర్యలు చేశారు. 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేసి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలింగా కోలుకున్నట్టు తెలిసింది. వృద్ధుడిని కాపాడిన గ్రామస్తులను కరప ఎస్ఐ టి.రామకృష్ణ అభినందించారు. అతడి ఆచూకీ తెలిసినవారు తమకు సమాచారమివ్వాలని కోరారు.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం : ఎమ్మెల్యే నెహ్రూ



జగ్గంపేటలో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే

జగ్గంపేట, జూన్ 24: అన్న క్యాంటీన్ల ద్వారా పేదవాడి ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక కాకినాడరోడ్‌లో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో టీడీపీ గండేపల్లి మండలాధ్యక్షులు పోతుల మోహన్‌రావు బావ సామర్లకోట మండలం మేడపాడుకు చెందిన మలిరెడ్డి వీరవెంకట సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన భార్య రమాదేవి ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన భోజనాలను ఎమ్మెల్యే పేదలకు వడ్డించారు. ఆయన మాట్లాడుతూ జగ్గంపేట, గోకవరం, కిర్లంపూడిలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి రూ.5కే పేదల ఆకలి తీరుస్తామన్నారు. టీడీపీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహన్‌రావు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, బొల్లంరెడ్డి రామకృష్ణ, రుచి హోటల్ నాగేంద్ర చౌదరి, కంటిపూడి రామారావు, అక్కిన సుదర్శన్‌రావు తదితరులున్నారు.

కిర్లంపూడి: టీడీపీ సీనియర్ నాయకుడు కాళ్ల దొంగబాబు ప్రథమ వర్ధంతిని చిల్లంగిలో తన స్వగృహంలో కుమారులు కాళ్ల రాజేష్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై దొంగబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తాం : ఎమ్మెల్యే



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, జూన్ 24: ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తామని, తుని ఏరియా ఆసుపత్రిని మరింత అభివృద్ధిపరిచి రోగుల అవసరాలకు అనుగుణంగా పూర్తిస్థాయి వసతులు కల్పిస్తామని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. సోమవారం ఎమ్మెల్యేగా తునిలో ఆమె విస్తృతంగా పర్యటించారు. ఏరియా ఆసుపత్రిని సందర్శించి అన్ని విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటిండెంట్, వైద్యులతో సమావేశమై రోగులకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని సూచించారు. తునిలో నర్సింగ్ కాలేజీ ఏర్పాటుకు తుని మున్సిపల్ కార్యాలయ ఆవరణ సమీపంలో స్థలాన్ని పరిశీలించి మున్సిపల్ అధికారులకు పలు సూచనలిచ్చారు. ఆమె వెంట టీడీపీ యువ నేత యనమల రాజేష్, ఇనుగంటి సత్యనారాయణ, చింతమనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, కుసుమంచి శోభారాణి తదితరులున్నారు.

'పశుమాంసం విక్రయాలు జరిపితే చర్యలు'

పిఠాపురం, జూన్ 24: నిబంధనలకు విరుద్ధంగా పశుమాంసం విక్రయించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కాకినాడ డీఎస్పీ హనుమంతరావు హెచ్చరించారు. పశుమాంసం విక్రయాలకు ఏ అనుమతులు లేవని స్పష్టం చేశారు. పశుమాంసం విక్రయించే వారితో సోమవారం పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు నిర్దేశించి అనుమతులు ఇచ్చిన చోటే కబేళా ఉండాలని స్పష్టం చేశారు. ఇళ్లల్లో గోవధ విక్రయాలు చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. సమావేశంలో పిఠాపురం సీఐ శ్రీనివాస్, అడిషనల్ ఎస్ఐ వెంకటేష్, కమిషనరు కనకారావు ఉన్నారు.


'చర్యలు తీసుకోకుంటే దీక్ష'

అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పశుకబేళాలు, గోవధ నివారణకు తక్షణ చర్యలు చేపట్టకుంటే ఆమరణ దీక్ష చేపడతామని విశ్వహిందూపరిషత్,భజరంగదళ్ ప్రతినిధులు హెచ్చరించారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వీహెచ్‌పీ, గోసంరక్షణ సంఘాల ప్రతినిధులతో కమిషనరు కనకరావు సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ఇందిరానగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఇళ్ల మధ్యే గోవధ జరుగుతున్నదని, మున్సిపల్ కార్యాలయం చెంతనే పశుమాంసం విక్రయాలు జరుగుతున్నాయని ప్రతినిధులు తెలపగా అనధికారిక కబేళాలను మూసివేయిస్తున్నట్టు కమిషనరు తెలిపారు.

'శాశ్వత ప్రాజెక్టుల రూపకల్పనపై దృష్టి సారిస్తాం'

కాకినాడ సిటీ, జూన్ 24: ప్రజలకు అవసరమైన శాశ్వత ప్రాజెక్టుల రూపకల్పనపై దృష్టి సారిస్తామని, ఈ ప్రాజెక్టులను లయన్స్ సీనియర్లతోపాటు సభ్యుల సహాయ సహకారాలతో అమలు చేయడానికి కృషి చేస్తామని లయన్స్ ఎలైట్ క్లబ్ అధ్యక్షుడు మైలవరపు సత్యనారాయణ అన్నారు. లయన్స్ ఎలైట్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమం సోమవారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఎస్‌వీవీ సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. క్లబ్ 2024-25 సంవత్సరానికి నూతన అధ్యక్షుడిగా మైలవరపు సత్యనారాయణ, కార్యదర్శిగా కే.వరప్రసాద్, కోశాధికారిగా టీ.సత్యనారాయణలతో ఫాస్ట్‌డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా ఉభయ తెలుగురాష్ట్రాల లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ దామెర శ్రీశాంతి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ జల విజ్ఞానసంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, కే.వరప్రసాద్ ప్రధాన వక్తలుగా వ్యవహరించారు. నూతన సభ్యులుగా ఇనోదయా హాస్పటల్ ప్రతినిధి వడ్డాది ఆదిత్య, గనుపూడి సుబ్బారావు గుప్త, గంధం సతీష్, కందాళం ప్రసాద్, కోటా ప్రసాద్‌లతో ప్రమాణం చేయించి సభ్యత్వాన్ని క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ కార్యదర్శి మంజులూరి విశ్వేశ్వరరావు అందజేశారు.

అధ్వానంగా వంతెన!



గోతులమయంగా మారిన వంతెన

ప్రత్తిపాడు, జూన్ 24: మండలం రాచపల్లి గ్రామం వద్ద పోలవరం కాలువ వంతెన అధ్వానంగా మారింది. ఈ వంతెనపై అఘాతాలు వంటి గోతుల పడడం, వర్షపునీరు బురదనీరు మిళితమై రోజులు తరబడి నిల్వ ఉండడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో వంతెనపై ఉన్న గోతుల వల్ల ప్రమాదాలు సంభవించి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ వంతెనపై మండలంలోని 20గ్రామాలు పైబడి ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. అయితే గోతులమయంగా ప్రమాదకరంగా మారిన ఈ రహదారి వల్ల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ వంతెనపై మరమ్మతులు చేపట్టి వర్షపునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

'చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలి'

కరప, జూన్ 24: ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో‌లు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ విజ్ఞప్తిచేశారు. పెద్దాపురప్పాడు శివారు వై.సావారం గ్రామంలో సోమవారం ఉపాధ్యాయులతో కలిసి నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు చైతన్యపరిచారు. ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ పబ్బినీడి పద్మావతి, హెచ్‌ఎంలు వరలక్ష్మి, ఎంఏ అలీమ్, సీఆర్‌పీలు రాజు,సారాకుమారి ఉన్నారు.

ఇలా కూడా డ్రెయిన్ కడతారా?

కొంత భాగం కట్టి మూసేశారు



గాంధీనగర్‌లో డ్రెయిన్ కట్టి మూసేసిన దృశ్యం

కాకినాడ సిటీ, జూన్ 24: ఎక్కడైనా డ్రెయిన్ కడితే మురుగునీరు ప్రవహించేలా దగ్గరలోని ప్రధాన మురుగు కాలువకు అనుసంధానం చేస్తారు. కాకినాడలోని ఓ ప్రాంతంలో ఇలాగ కూడా డ్రెయిన్ కడతారా అని ఆశ్చర్యపరిచారు. గాంధీనగర్‌లో వైఎస్సార్ స్టేడియం ముందు కొంతభాగం డ్రెయిన్ కట్టి మూసేశారు. ఈ డ్రెయిన్‌ను దగ్గరలోని ఏ ప్రధాన మురుగు కాలువకు అనుసంధానం చేయలేదు. దీంతో ఈ డ్రెయిన్ ఎందుకు కట్టారో తెలియక స్థానికులు తికమకపడుతున్నారు. ఈ డ్రెయిన్‌లో చెత్త చెదారంతో నిండిపోవడం వల్ల దోమలు, ఇతర క్రిమికీటకాలు వ్యాప్తి చెందుతున్నాయి. దీనికితోడు ఈ డ్రెయిన్‌లో వర్షం నీరు నిలిచిపోయి దుర్గంధభరితంగా మారింది. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కలెక్టర్ ప్రత్యేక పూజలు



కలెక్టర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న బాలాత్రిపురసుందరి ఆలయ ఈవో

పోర్టుసిటీ (కాకినాడ), జూన్ 24: జిల్లా కలెక్టర్‌గా నియమితులైన సగిలి షణ్మోహన్ బాలాత్రిపురసుందరి అమ్మవారికి పూజలు సోమవారం నిర్వహించారు. సూర్యారావుపేటలోని రామలింగేశ్వరస్వామి సమేత బాలాత్రిపురసుందరి అమ్మవారి ఆలయానికి కలెక్టర్ విచ్చేయగా ఆలయ ఈవో సీహెచ్‌వీ.భాస్కరరెడ్డి, ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కలెక్టర్ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం వేద మంత్రాలతో ఆశీర్వదించారు.

'సమస్యల పరిష్కారానికి తోడ్పాటు'

కాకినాడ సిటీ: జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించాలని ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సగిలి షణ్మోహన్‌ను సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ గుద్దటి రామ్మోహనరావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, కార్యవర్గ సభ్యులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సరెళ్ల చంద్రరావు, పి.పాండురంగారావు, సంయుక్త కార్యదర్శులు నీలపాల వీరబాబు, బి.శ్రీనివాసరావు, కాకినాడ సిటీ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు అరదాడి సత్తిరాజు, వై.రామకృష్ణ, పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



విత్తనాల కిట్లు అందజేస్తున్న వ్యవసాయాధికారులు

పిఠాపురం రూరల్, జూన్ 24: వరి సాగులో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.దయాకర్, డాక్టర్ శర్మ తెలిపారు. పిఠాపురం మండలం విరవలో విత్తన గ్రామ పథకానికి ఎంపిక చేసిన పొలాలను వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతిలో కలిసి వారు సోమవారం పరిశీలించారు. నూతన వరి వంగడం అయిన ఎంటీయూ 1275 రకం విత్తనాల చిరుసంచులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

గొల్లప్రోలు రూరల్, జూన్ 24: గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో సోమవారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రధాన రహదారులు, వీధులు వెంబడి పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించే పనులు చేపట్టారు. డ్రెయిన్లలో పూడికలు తొలగిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

మరిడమ్మ హుండీల లెక్కింపు

పెద్దాపురం, జూన్ 24: మరిడమ్మ హుండీల ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించారు. 93 రోజులకు రూ.3,82,895 ఆదాయం సమకూరినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, దేవదాయశాఖ అధికారులు చల్లా ఉదయ్‌బాబునాయుడు, సత్యనారాయణ, ఆసాదులు,సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీల ప్రదర్శన

ప్రత్తిపాడు, జూన్ 24: మండలంలోని ధర్మవరంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనను మండల పరిషత్ మెయిన్ పాఠశాల వద్ద సీడీపీవో ఆర్‌వీ లక్ష్మి ప్రారంభించారు. 3ఏళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీకి పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. ధర్మవరం సెక్టార్ సూపర్‌వైజర్ జి.చక్రవేణి పాల్గొన్నారు.

టీడీపీ నేతల హర్షం

తాళ్లరేవు, జూన్ 24: అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌ని టీడీపీ పార్లమెంట్ విప్‌గా ఎంపిక చేయడంపై తాళ్లరేవు మండల ఎస్సీబీసీ నేతలు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ నేతలు జక్కల ప్రసాద్‌బాబు, వెంటపల్లి చంద్రమౌళి, మోర్త భైరవమూర్తి, బీసీనేతలు పిల్లి సత్తిబాబు, గంజా సూరిబాబు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.

జనసేన నాయకుల సంబరాలు

పిఠాపురం, జూన్ 24: కాకినాడ ఎంపీగా తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ లోక్‌సభలో ప్రమాణస్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద సోమవారం సంబరాలు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.

ఎస్ఐగా వెంకటేశ్వరరావు

రౌతులపూడి, జూన్ 24: రౌతులపూడి నూతన ఎస్‌గా జి.వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నవరం అదనపు ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు.

గిడజాంలో లారీ బోల్తా

రౌతులపూడి, జూన్ 24: గిడజాంలో క్వారీ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. కేజీపీఎల్‌కి క్వారీ మెటల్ తరలించి తిరిగి వస్తూండగా బోల్తాపడగా ఎవరికిగాయాలు కాలేదు.

దస్తావేజులు పడిపోయినవి

సామర్లకోట మండలం వెంకట కృష్ణారాయపురంనకు చెందిన గొల్లపల్లి వెంకటరమణకు చెందిన డాక్యుమెంట్ నంబర్ 5140/2006 గల దస్తావేజులతో ఉన్న కవరు 22.5.24న సామర్లకోటలో గల్లంతు అయ్యినది. లభించిన వారు 9848726436 కు తెలుపగలరు.

PUBLIC NOTICE

HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATHI

Between: CRP No.6 of 2021

Sunkara Venkata Satyanarayana @Narayana@S.S.Narayana & Another ...Petitioners

Amalakanti Prasad and others ...Respondents

To

1. Amalakanti Prasad S/o Late Sri Suri Babu, R/o Rajeev Gruhakalpa, Tuni-533 401
2. Amalakanti Srinu, S/o Late Sri Suri Babu, R/o Rajeev Gruhakalpa, Tuni - 533 401
3. Amalakanti Siva S/o Late Sri Suri Babu, R/o Rajeev Gruhakalpa, Tuni - 533 401

Take notice that my clients Mr. Sunkara Venkata Satyanarayana and his brother Gopi filed CRP No. 6 of 2021 against the order dated 16-12-2020 in OS No.143 of 2014 on the file of the court of the principal Junior Civil Judge, Tuni and you are arrayed as Respondents 1 to 3 therein. The Hon'ble High Court by its order dated 19-06-2024 was pleased to permit the petitioners to cause service of notice on you through paper publication as the notices sent earlier were returned un-served. You are hereby informed that the said case i.e., CRP No.6 of 2021 is directed to be listed on 10-07-2024 before the Hon'ble High Court. You are called upon to enter appearance in the matter. Hence, this notice.

N.SIVA REDDY
Advocate, High Court of A.P.
Counsel for the Petitioners